సాక్షి అనకాపల్లి

బుధవారం ׀ 20 ׀ డిసెంబర్ ׀ 2023



వైభవంగా ధనుర్మాస పూజలు

సింహాచలం: సింహగిరిపై మంగళవారం ధనుర్మాస పూజల్లో భాగంగా గోదాదేవికి బేడామండపంలో తిరువీధి నిర్వహించారు.



గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామాల్లో మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల అయిదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంజీజీఎస్ కుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు 28.3 నుంచి 28.6 డిగ్రీలు, తేమ 60 నుంచి 67 శాతం, గాలి గంటకు 8 నుంచి 9 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు రేపు

అనకాపల్లి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఈనెల 21న స్థానిక రింగ్ రోడ్డులోని మంత్రి కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొంటారని, ఉదయం 9 గంటలకు రక్తదాన శిబిరం, 10 గంటలకు పేదలకు వస్త్రాల పంపిణీ అనంతరం జన్మదిన కేక్ కటింగ్ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, వివిధ విభాగాల అనుబంధ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, జెడ్పీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఆరోగ్యశ్రీతో పేదలకు మరింత భరోసా

- కొత్త కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి అమర్‌నాథ్



నూతన ఆరోగ్యశ్రీ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి: బడుగు, బలహీనవర్గాల ప్రజల పాలిట సంజీవనిలా ఉన్న ఆరోగ్యశ్రీ పథకం పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరింత భరోసా కల్పించారని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలో గోపాలపురం గ్రామం సచివాలయ పరిధిలో మంగళవారం నూతన ఆరోగ్యశ్రీ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యం కోసం పేదలు అప్పు చేయాల్సిన అవసరం లేదని, పూర్తిస్థాయిలో వైద్య సహాయం అందించేలా కొత్త ఆరోగ్యశ్రీ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. పేదవారు ఈ కార్డు ద్వారా కార్పొరేట్ స్థాయి ఆస్పత్రిలో వైద్యం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారి వాణి జగదీశ్వరి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యాలయంలో సీటీ స్కాన్ ప్రారంభం నేడు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో రూ.2 కోట్లతో నూతన సీటీ స్కాన్ యంత్రాన్ని బుధవారం ఉదయం 10 గంటలకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించనున్నట్లు వైద్యాలయం సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యాలయంలో 10 ఏళ్లుగా సీటీ స్కాన్ లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొనేవారని, మంత్రి, కలెక్టర్, ఎంపీల చొరవతో ఈ యంత్రాన్ని రోగులకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఉత్తరాంధ్ర రాజకీయాల్లో ద్రోణంరాజు చెరగని ముద్ర



ద్రోణంరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరివెంకట కుమారి

బీచ్‌రోడ్డు: ఉత్తరాంధ్ర రాజకీయాల్లో ద్రోణంరాజు సత్యనారాయణ చెరగని ముద్ర వేశారని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ద్రోణంరాజు సత్యనారాయణ జయంతిని పురస్కరించుకుని మంగళవారం సిరిపురంలో ద్రోణంరాజు సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి మంత్రి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్యే అదీప్ రాజ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పాల్గొన్నారు.

ముగిసిన వార్షిక స్పోర్ట్స్ మీట్

పీఎంపాలెం: బక్కన్నపాలెం ఏపీఎస్పీ 16వ బెటాలియన్ పోలీస్ శిక్షణ కేంద్రంలో గత రెండు రోజులుగా జరుగుతున్న ఏడో వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ మంగళవారం సాయంత్రంతో ముగిసింది. 16వ బెటాలియన్ కమాండెంట్ గౌతమీ శాలిని పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో పోలీస్ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయనగరం ఎస్పీ దీపికా పాటిల్ మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తున్న పోలీస్ క్రీడాకారులను డిపార్టుమెంట్ అన్ని రకాలుగా ప్రోత్సహిస్తుందన్నారు. బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ పి.శామ్యూల్ జాన్ పాల్గొన్నారు.

దళితుల హృదయాల్లో తండ్రీ తనయులు

- రోడ్డున పడేసిన చంద్రబాబు
- భూములు కొనుగోలు చేసి ఆధారం అందించిన వైఎస్సార్
- రుణమాఫీ చేసి శాశ్వత హక్కులు కల్పించిన వైఎస్ జగన్

ఎవరైనా ఎస్సీలుగా పుట్టాలని కోరుకుంటారా అని చులకనగా మాట్లాడారు చంద్రబాబు.. నిరుపయోగంగా ఉన్న చెరువును ఆధారం చేసుకొని బతుకుతున్న దళిత రైతులను వెళ్లగొట్టారు..

ఎస్సీ కార్పొరేషన్‌తో ఆ భూములు కొనుగోలు చేయించి, 75 శాతం రాయితీ అందించి సాగు చేసుకోమన్నారు వైఎస్సార్..

మిగిలిన 25 శాతం రుణాన్ని మాఫీ చేసి, ఆ భూములపై శాశ్వత హక్కులు కల్పించారు వైఎస్ జగన్..

ముగ్గురు ముఖ్యమంత్రుల తీరును గమనించిన దళితులు ఎవరిని గుండెల్లో పెట్టుకుంటారో.. ఎవరిని తిరస్కరిస్తారో వేరే చెప్పనక్కరలేదుగా..



ఈనెల 17న లబ్ధిదారులకు జగనన్న సంపూర్ణ భూహక్కు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్



సంపూర్ణ హక్కులు కల్పించిన భూమిలో దళితులతో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, తహసీల్దార్ శ్రీనివాస్ (ఫైల్)

నాతవరం: చంద్రబాబు హయాంలో దళితులను బయటకు గెంటేయడంతో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఆదుకొని భరోసా నిచ్చారు. ఆ దళితులకు జగనన్న సంపూర్ణ భూహక్కు కల్పించి.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 61 కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇవ్వడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో చమ్మచింత గ్రామం తాండవ రిజర్వాయర్‌ను ఆనుకొని ఉంది. తాండవ ప్రాజెక్టు నిర్మించాక ఈ గ్రామాన్ని ఆనుకొని ఉన్న పెద్ద చెరువు నిరుపయోగంగా ఉండేది. రెక్కాడితే గానీ డొక్కాడని చమ్మచింత ఎస్సీ కాలనీవాసులు 1974 నుంచి నిరుపయోగంగా ఉండే చెరువులో పంటలు పండించుకొని జీవనం సాగించేవారు. చంద్రబాబు 2003లో నీరు చెట్టు పేరుతో వారిని వెళ్లగొట్టారు. జీవనం సాగించేందుకు వేరొక మార్గం లేక దళితులు ఇతర ప్రాంతాలకు వలస పోయేందుకు సిద్ధపడ్డారు. అప్పట్లో స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మైనం సూర్యనారాయణ (మునసబు) వారికి అండగా నిలిచి.. కొద్దికాలానికే ముఖ్యమంత్రి అయిన వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి వారి సమస్యను తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన వైఎస్సార్ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూములు కొనుగోలు చేసి దళితులకు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అప్పటి జాయింట్ కలెక్టర్ సందీప్‌కుమార్ సుల్తానియా చమ్మచింతలో పర్యటించి రైతుల నుంచి భూములు కొనుగోలు చేసి దళితులకు ఇచ్చారు. ప్రభుత్వం వాటా 75 శాతం, దళితుల వాటా 25 శాతం కింద రుణం ఏర్పాటు చేశారు. ఆ భూముల్లో సాగు చేసుకొని 25 శాతం రుణం చెల్లించేలా ఎస్సీ కార్పొరేషన్ నిబంధన విధించింది.

రూ.లక్షలోపు రుణ మాఫీ చేసిన సీఎం జగన్

వైఎస్సార్ తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఎస్సీ కార్పొరేషన్‌లో లక్షలోపు రుణం ఉన్న వారందరికీ మాఫీ చేశారు. చమ్మచింతలో 53 మంది ఆ జాబితాలోకి రావడంతో వారందరికీ రుణ మాఫీ జరిగింది. ఎస్సీ కార్పొరేషన్‌లో రుణం తీరిపోవడంతో ప్రభుత్వం కొనుగోలు చేసిన ఆ భూమిని 'జగనన్న దళిత సంపూర్ణ భూహక్కు పథకం'లో ఇచ్చేందుకు కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. చమ్మచింతలో 53 మందికి 67 సెంట్ల చొప్పున మొత్తం 35 ఎకరాలకు దళిత సంపూర్ణ హక్కు పత్రాలను ఇటీవల ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పంపిణీ చేశారు. ఇదే విధంగా బుచ్చెయ్యపేట మండలంలో 8మందికి జగనన్న సంపూర్ణ భూహక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఆ భూమిని క్రయవిక్రయాలు చేసుకునేలా ప్రభుత్వం పూర్తి హక్కులు కల్పించింది. ఆ భూములపై జాతీయ బ్యాంకుల్లో సైతం రుణం పొందేందుకు సర్వహక్కులు ఇచ్చారు.

ఒక్కో వ్యక్తికి రూ.20 లక్షల స్థిరాస్తి

దళితులు పొందిన భూమి విలువ మార్కెట్ రేటును బట్టి రూ.30 లక్షల ధర పలుకుతోంది. దీనిని బట్టి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి రూ.20 లక్షలకు పైగా స్థిరాస్తి ఇచ్చినట్లుగా భావిస్తున్నారు. వలసపోయే దళితులకు నాడు వైఎస్సార్.. నేడు ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకొని లక్షల విలువైన స్థిరాస్తి కల్పించారు.

అడ్డుకునేందుకు అయ్యన్నపాత్రుడి యత్నం

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూములు కొనుగోలు చేసి దళితులకు ఇవ్వడానికి వైఎస్సార్ ప్రభుత్వం పూనుకోగా 2005లో అయ్యన్నపాత్రుడు అడ్డుతగిలారు. అవినీతి జరిగిందంటూ జెడ్పీ సమావేశంలో ఎమ్మెల్యే హోదాలో అయ్యన్నపాత్రుడు రభస చేశారు. తర్వాత నేరుగా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. అప్పటి పాడేరు ప్రాజెక్టు అధికారి శ్రీకాంత్ ప్రభాకర్‌ను విచారణకు ఆదేశించడంతో గ్రామంలో జరిపిన బహిరంగ విచారణలో ఎలాంటి అవకతవకలు లేవని నిర్ధారించారు.

ప్రభుత్వం సంపూర్ణ హక్కు కల్పించింది



లక్షలోపు రుణాలు ఉన్న వారందరికీ ప్రభుత్వం రుణ మాఫీ చేసింది. జిల్లాలో చమ్మచింతలో 53మందికి, బుచ్చెయ్యపేట మండలంలో 8మందికి జగనన్న దళిత సంపూర్ణ హక్కు పత్రాలు ఇచ్చారు. ఆ భూములను దళితులు క్రయ విక్రయాలు చేసుకోవచ్చు. బ్యాంకులో రుణాలు పొందేలా ప్రభుత్వం సర్వహక్కులు కల్పించింది.

–రామారావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎస్సీ కార్పొరేషన్

సీఎంకు రుణపడి ఉంటాం



దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి భూములు ఇచ్చి ఆదుకున్నారు. ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆ భూములకు పూర్తి హక్కులు కల్పించి స్థిరాస్తి ఇచ్చారు. మా దళితుల కుటుంబాల్లో వెలుగులు నింపారు. తండ్రీ తనయులకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– దండా నూకరాజు, చమ్మచింత గ్రామపెద్ద

దేవుడి రూపంలో స్థిరాస్తి ఇచ్చారు



మా పేద దళితులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేవుడి రూపంలో భూములకు సంపూర్ణ హక్కు పత్రాలు ఇచ్చారు. మా తర్వాత మా కుటుంబ సభ్యులు ఈ స్థిరాస్తిని అనుభవించవచ్చు. అవసరమైతే అమ్ముకోవచ్చు. కలలో కూడా ఊహించని విధంగా మేలు జరిగింది.

–పార్వతి, లబ్ధిదారు, చమ్మచింత గ్రామం

రేపు ఏజెన్సీలో సీఎం జగన్ పర్యటన



ఏర్పాట్లపై కలెక్టర్ సుమిత్ కుమార్‌తో చర్చిస్తున్న మంత్రి అమర్‌నాథ్, చిత్రంలో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి, పాడేరు/చింతపల్లి రూరల్: ఈనెల 21వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లికి రానున్నారు. ఈ సందర్భంగా ఆయన 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌ల పంపిణీని ప్రారంభిస్తారు. అల్లూరి జిల్లా ఇన్‌చార్జి గుడివాడ అమర్‌నాథ్ మంగళవారం సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మితో కలిసి సభా వేదిక, హెలిప్యాడ్ ఏర్పాటు ప్రాంతాలను పరిశీలించారు. ట్యాబ్‌లు పంపిణీ చేసే గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు బాగుంటే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందన్నారు. అందుకు తగ్గట్టుగానే ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానం మెరుగుపరిచేందుకు 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు అందిస్తుందన్నారు. ఐదో తరగతి నుంచి విద్యార్థులకు టోఫెల్, జీఆర్‌ఈ శిక్షణ ఇస్తోందన్నారు.

ఇదీ సీఎం షెడ్యూల్

- ముఖ్యమంత్రి గన్నవరం ఎయిర్‌పోర్టులో బయలుదేరి గురువారం ఉదయం 9.50 గంటలకు విమానంలో విశాఖపట్నం చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో ఉదయం 10 గంటలకు చింతపల్లి పర్యటనకు బయలుదేరుతారు.
- చింతపల్లికి సమీపంలో చౌడుపల్లి గ్రామంలో సిద్ధం చేసిన హెలిప్యాడ్‌కు ఉదయం 10.30 గంటలకు చేరుకుంటారు. అక్కడ పది నిమిషాల పాటు ప్రజలతో సీఎం మాట్లాడతారు. అనంతరం 10.45కు రోడ్డు మార్గంలో బయలుదేరి 10.50 గంటలకు చింతపల్లిలోని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల–1కు చేరుకుంటారు. 10.50 నుంచి 11.05 వరకు అక్కడి విద్యార్థులతో మాట్లాడతారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తారు.
- గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల–1లో ఉదయం 11.05 గంటలకు బయలుదేరి 11.10 గంటలకు చింతపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానానికి చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన టెక్ అనేబుల్డ్ లెర్నింగ్ అండ్ టీచింగ్ స్టాల్‌ను 11.10 నుంచి 11.15 గంటల వరకు సందర్శిస్తారు. 11.20 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే సభలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారు.
- మధ్యాహ్నం 12.30 గంటలకు సభా ప్రాంగణం నుంచి సీఎం రోడ్డు మార్గాన బయలుదేరి చౌడుపల్లిలోని హెలిప్యాడ్‌కు 12.40కు చేరుకుంటారు. 12.40 నుంచి 1.25 వరకు స్థానిక నాయకులతో సీఎం మాట్లాడతారు. మధ్యాహ్నం 1.30 గంటలకు హెలికాప్టర్‌లో విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు సీఎం తిరుగు ప్రయాణమవుతారు. 2.00 గంటలకు ఎయిర్‌పోర్టులో దిగిన వెంటనే 2.10 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయలుదేరతారు.

27 నుంచి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు

- నివారణకు ప్రత్యేక చర్యలు
- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



కరపత్రాలను ఆవిష్కరించిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో జాతీయ కుష్టు నిర్మూలన, వ్యాధిపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో కుష్టువ్యాధి నివారణపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. ఎస్పీ కె.వి.మురళీకృష్ణతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించారు. కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో ఈనెల 27 నుంచి జనవరి 12వ తేదీ వరకు కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం జరుగుతుందని, ఈ వ్యాధి లక్షణాలు ఉంటే సర్వే చేసే ఆరోగ్య కార్యకర్తలకు తెలియజేయాలని చెప్పారు. ఎస్పీ కె.వి.మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలోనే చికిత్స చేయించుకుంటే వ్యాధి వెంటనే తగ్గిపోతుందన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్, నర్సీపట్నం ఎమ్మెల్యే పి.ఉమాశంకర్ గణేష్ పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానంతో మెరుగైన ఫలితాలు

- కిసాన్ మేళా ద్వారా వివిధ రకాల పంటలపై అవగాహన
- రైతులకు చేదోడువాదోడుగా ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు
- వ్యవసాయ వర్సిటీ పరిశోధన సంచాలకులు ప్రశాంతి
- అనకాపల్లి పరిశోధన స్థానంలో ఘనంగా 64వ కిసాన్ మేళా
- అలరించిన వ్యవసాయ స్టాళ్లు.. ప్రతిభావంతులకు అవార్డులు



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను తిలకిస్తున్న ప్రశాంతి



డ్రోన్‌ను పరిశీలిస్తున్న ప్రశాంతి, జగన్నాథరావు, రత్నాకర్

సాక్షి, అనకాపల్లి: ఆధునిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి అన్నారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్‌ఏఆర్‌ఎస్)లో మంగళవారం 64వ కిసాన్ మేళా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్, డైరెక్టర్ సాయిలక్ష్మి, డాక్టర్ విష్ణుమూర్తిలతో కలిసి ఆమె జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆర్‌ఏఆర్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. వ్యవసాయ ప్రదర్శనలు, విద్యార్థులకు వ్యవసాయ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఈ కిసాన్ మేళా ద్వారా రైతులు, విద్యార్థులు వివిధ రకాల పంటలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కిసాన్ మేళా రైతులకు పండగ రోజులాంటిదని కొనియాడారు. అనేక చెరకు, వరి వంగడాలను అభివృద్ధి చేసి శాస్త్రవేత్తలు రైతు బాంధవులుగా నిలిచారన్నారు. వ్యవసాయంలో మెలకువలు నేర్పుతూ.. విపత్తుల సమయంలో పంటలను రక్షించుకునేవిధంగా సూచనలు, సలహాలు ఇస్తూ అధిక దిగుబడి సాధించేలా ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు రైతులను ముందుకు నడిపిస్తున్నారన్నారు. ఏడాదిపాటు శాస్త్రవేత్తల పరిశోధనలను తాను పరిశీలించానని, వ్యవసాయంలో సాగు ఖర్చులు తగ్గించుకునేందుకు యాంత్రీకరణ పద్ధతిని పాటించాలన్నారు. అమెజాన్ లాంటి యాప్‌ల ద్వారా ఎరువులు, వ్యవసాయ ఉత్పత్తులు, బెల్లం ఆధారిత ఉత్పత్తులను విదేశాలకు మార్కెటింగ్ చేస్తున్నట్లు ఆమె చెప్పారు.

లాభసాటిగా మార్చుకోవాలి

వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ మాట్లాడుతూ.. ఆధునిక పరిజ్ఞానం ద్వారా వ్యవసాయాన్ని రైతులు లాభసాటిగా మార్చుకోవాలన్నారు. ఆసియాలోనే రెండో అతి పెద్ద బెల్లం మార్కెట్‌గా అనకాపల్లి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుందన్నారు. దేశానికే రైతు వెన్నెముకలాంటివాడని, అలాంటి రైతుకు వ్యవసాయంలో నష్టం వాటిల్లితే అది జాతి మనుగడ ప్రమాదకరంగా మారుతుందన్నారు. అధిక దిగుబడి వస్తే దేశానికే వరి అందిస్తామని, అదే రైతు వ్యవసాయానికి దూరమైతే చైనా దేశంలా ప్లాస్టిక్ రైస్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు మేరకు ప్రతీ ఏటా పంటలను మార్పు చేస్తూ భూసార పరీక్షలు నిర్వహించుకుంటూ వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు సాధించుకుంటామన్నారు. విశ్వవిద్యాలయం బోర్డు మెంబర్ సాయిలక్ష్మి మాట్లాడుతూ.. మనిషి రాత బ్రహ్మ రాస్తే..కోట్లాది ప్రజలకు తిండి పెట్టే రైతు రెండో బ్రహ్మ అని కొనియాడారు. అలాంటి రైతులను ఆదుకునేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్బీకేల ద్వారా నూతన సంస్కరణలు తీసుకొచ్చారన్నారు.

ఆధునికతతో లాభసాటి వ్యవసాయం

ఏడీఆర్ పి.వి.కె.జగన్నాథరావు మాట్లాడుతూ చెరకు పంట కీలకమైన ఆధునిక చెరకు సాగు అభివృద్ధి, సాగులో ఆధునిక పద్ధతులు, విధానాలు పాటించాలని, పంటల ఖర్చు తగ్గించుకునేందుకు జీవన ఎరువులు వినియోగం, తక్కువ ఖర్చుతో జీవరసాయనాల వినియోగించాలని చెప్పారు. బెల్లం ఆధారిత ఉత్పత్తుల తయారీపై ఆయన వివరించారు. డ్రోన్ టెక్నాలజీ కూడా రైతులకు అందుబాటులో తీసుకొచ్చామని అన్నారు. అంతకుముందు కిసాన్ మేళాలో ప్రదర్శించిన పలు స్టాల్స్, 2023–24 సంవత్సరాలకుగాను శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసిన బ్రోచర్లను ఆవిష్కరించారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన రైతులు, శాస్త్రవేత్తలను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, విశ్వవిద్యాలయం బోర్డుమెంబర్ సాయిలక్ష్మి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.మోహనరావు, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ఆశాదేవి, జిల్లా ఉద్యానవన అధికారి ప్రభాకర్, నాలుగు జిల్లాల శాస్త్రవేత్తలు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



ఉత్తమ రైతును అవార్డుతో సత్కరిస్తున్న ప్రశాంతి



చిరుధాన్యాల పంటలపై ప్రతిభ కనబరిచిన మహిళా రైతుకు అవార్డు ప్రదానం



చిరుధాన్యాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రశాంతి చిత్రంలో జగన్నాథరావు, రత్నాకర్



కిసాన్‌మేళాకు హాజరైన రైతులు

ఆధునిక విధానాలతో దేశవాళీ గోవుల సంరక్షణ

- రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ విజయకుమార్



నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న గొల్లపల్లి విజయకుమార్

తుమ్మపాల: దేశవాళీ గోవులను సంరక్షించడం మన అందరి బాధ్యత అని, ఆడ పెయ్యల ఉత్పత్తి పథకం అందుకు సరైన మార్గమని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ అన్నారు. సత్యలక్ష్మి గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో నేషనల్ లైవ్ స్టాక్ మిషన్, రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథి పాల్గొన్నారు. ప్రదర్శనలో ఉంచిన దేశవాళీ గోవు జాతులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులలో కృత్రిమ గర్భధారణ, లింగ నిర్ధారిత వీర్యం మీద పాడి రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పడు మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం ద్వారా 90 శాతం ఆడ పెయ్యలే పుడతాయని, 2 వీర్య నాళికల ఖరీదు రూ.1350 కాగా ప్రభుత్వ రాయితీ కింద రూ.850 ఇస్తుందని, రైతు వాటాగా రూ.500 చెల్లిస్తే చాలన్నారు. పశువు చూడు కట్టకుంటే రైతు వాటా రూ.500 తిరిగి చెల్లిస్తామన్నారు. ఏపీఎల్‌డీఏ అదనపు ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ రజని మాట్లాడుతూ జిల్లాలో పిండ మార్పిడి పద్ధతి ద్వారా మేలు జాతి పశువుల పిండాన్ని అద్దె పశువు గర్భంలో ప్రవేశపెట్టి పెయ్యను పుట్టించారని, ఈ పిండ మార్పిడి పద్ధతి ద్వారా మేలు జాతి పశువుల పిండాలను వాడి, ఒక ఏడాదికి 8 నుంచి 10 పెయ్యలను పుట్టించవచ్చన్నారు. విజయనగరం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ బంగారునాయుడు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ప్రసాదరావు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రిటైర్డ్ పోలీస్ సిబ్బందికి ఆర్థికసాయం



అనారోగ్యంతో బాధపడుతున్న జ్వాలా ముకుందకు చెక్కు అందిస్తున్న వెల్ఫేర్ సభ్యులు

అనకాపల్లి : దీన స్థితిలో ఉన్న సహచర పోలీసు ఉద్యోగులను ఆర్థికంగా ఆదుకోవాలనే సంకల్పంతో శక్తి పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ పని చేస్తోందని పదవీ విరమణ చేసిన 1990 పోలీస్ బ్యాచ్ సభ్యులు అన్నారు. ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లాలో అనారోగ్యంతో బాధపడుతున్న ఏఎస్ఐలు పి.గోవిందు, ఈ.అప్పారావు, హెచ్‌సీలు కె.ఎల్.నూకేశ్వరరావు, ఎస్.అప్పారావు, నూకరాజు, జ్వాలాముకుందలకు మంగళవారం రూ.1,10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అనిల్, మిలిటరీ నాయుడు, వెంకటేశ్వరరావు, సుబ్బరాజు, రమేష్, లక్ష్మణరావు, సింహాచలం, బాబూరావు, రఘు, భీశెట్టి వెంకటేశ్వరరావు, నారాయణ, పూర్ణచంద్ర, నాయుడు, నర్సింగరావు పాల్గొన్నారు.

గణిత పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



మెమెంటోలతో విజేతలైన విద్యార్థులు

పాయకరావుపేట : విద్యార్థుల్లో దాగి వున్న గణిత ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు ప్రతి ఏటా రామచంద్రాపురం రామానుజన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది జరిగిన ప్రతిభా పరీక్షల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు మాచినేని అపూర్వ (7 వ తరగతి), ముత్యాల విశ్రుత్ (4 వ తరగతి) జిల్లాస్థాయిలో రెండవ ర్యాంక్ సాధించారని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.

సాగర తీరంలో సూపర్ పంచ్

ఉత్సాహంగా సీఎం బాక్సింగ్ స్టేట్ చాంపియన్‌షిప్



బౌట్‌ను ప్రారంభిస్తున్న కాయల వెంకట రెడ్డి



బాక్సింగ్ చేస్తున్న క్రీడాకారులు

బీచ్‌రోడ్డు (విశాఖ) : సాగర తీరంలో సూపర్ పంచ్‌లు సందర్శకులను అలరించాయి. ఒకరి మీద ఒకరు దూకుడుగా పంచులు విసురుతో నువ్వా నేనా అన్నట్లు ఎంతో ఉత్సాహంగా బాక్సింగ్ పోటీల్లో తలపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్, ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కాయల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సీఎం బాక్సింగ్ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం వైఎంసీఏ వద్ద ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కాయల వెంకటరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ పుట్టినరోజును పురస్కరించుకొని గత మూడేళ్లగా బాక్సింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి బాక్సర్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. ముఖ్యమంత్రి ఆశీస్సులతో మరిన్ని క్రీడా కార్యక్రమాలకు రూపకల్పన చేస్తామన్నారు. ముఖ్యమంత్రి జన్మదినమైన 21వ తేదీన పోటీల్లో విజేతలకు ట్రోఫీ, నగదు ప్రోత్సాహకాలు అందించనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పాల్గొంటారన్నారు.

క్రీడాకారులకు సువర్ణావకాశం

సీఎం జగన్ పుట్టినరోజున పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ పోటీలు క్రీడాకారులకు ఒక సువర్ణ అవకాశమని జీసీసీ ఛైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి అన్నారు. క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు ఇదో చక్కని అవకాశం అన్నారు.

150 మంది క్రీడాకారులు, 12 విభాగాలు

రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వీరికి 12 విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నారు. యూత్, జూనియర్ కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తున్నారు.

తొలి రోజు 26 బౌట్లు

తొలిరోజు మూడు విభాగాల్లో 26 బౌట్లు నిర్వహించారు. యూత్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. సందర్శకులకు ఎంతో ఆసక్తిగా మ్యాచ్‌లను తిలకించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, ఆంధ్ర బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎస్ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు స్కిల్ డెవలప్‌మెంట్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడుకు ప్రత్యేక ఆహ్వానం



డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడును ఆహ్వానిస్తున్న ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు

దేవరాపల్లి : ఈ నెల 21న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని విశాఖలోని వుడా చిల్డ్రన్ థియేటర్‌లో నిర్వహించే పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరు కావాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు ఆహ్వానం పలికారు. ఈ మేరకు తారువ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం డిప్యూటీ సీఎంను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సంస్థ ద్వారా శిక్షణ పొంది ఉద్యోగాలు చేస్తున్న ఉమ్మడి విశాఖ, తూర్పు గోదావరి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన సుమారు 1000 మంది పూర్వ విద్యార్థులతో సమావేశం జరుగుతుందని డిప్యూటీ సీఎంకు వివరించారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.శ్యామ్‌ప్రసాద్, స్టేట్ మిషన్ మేనేజర్ ఎల్. ప్రసాదబాబు తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థినిపై లైంగిక దాడికి యత్నం

- పోలీసుల అదుపులో నిందితుడు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థినిపై అదే ప్రాంతంలోని ప్లైవుడ్ ఫ్యాక్టరీకి చెందిన ఉత్తరాది కార్మికుడు మంగళవారం లైంగిక దాడికి యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. పార్వతీపురానికి చెందిన ఆమె 2021లో ఇక్కడి కళాశాలలో సీఎస్‌సీ పూర్తి చేసింది. ప్రస్తుతం ఆ కళాశాలను మరో యాజమాన్యం నిర్వహిస్తోంది. కాగా.. సర్టిఫికెట్ల కోసం వచ్చిన ఆమెపై మద్యం సేవించిన కార్మికుడు నిర్మానుష్య ప్రాంతంలో దాడికి యత్నించాడు. ఇది గమనించిన పశువుల కాపరులు (మహిళలు)..ఆమెను రక్షించి తీసుకువెళ్లారు. కళాశాల సిబ్బంది ఫిర్యాదుతో భీమిలి పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఆమెను భీమిలి స్టేషన్‌కు తరలించి.. ఆమెతో పాటు స్థానికులను విచారించారు. వారు చెప్పిన వివరాలతో దాకమర్రి, బోడమెట్టపాలెం పరిసర ప్రాంతాల్లోని ప్లైవుడ్ ఫ్యాక్టరీల్లో గాలించి యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. భీమిలి సీఐ డి.రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేక్ మిక్సింగ్ సందడి



కేక్ మిక్సింగ్‌లో యువతులు



విశాఖ సిటీ: బ్లూ మ్యాంగో గౌర్మెట్‌లో కేక్ మిక్సింగ్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పెదవాల్తేరు ప్రాంతంలో సంప్రదాయ ఇంటీరియర్స్‌తో పాశ్చాత్య వెరైటీలను అందించే కాఫీ షాప్‌లో యూరప్ క్రిస్మస్ సంప్రదాయ విధానంలో కేక్ మిక్సింగ్ చేపట్టారు. బ్లూ మ్యాంగో గౌర్మెట్ యజమానురాలు భాగ్యర్క సిన్హా ఆధ్వర్యంలో జరిగిన ఈ మిక్సింగ్ సెలబ్రేషన్స్‌లో యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 100 కేజీల ఈ కేక్‌లో 15 రకాల డ్రై ఫ్రూట్స్, ఆరెంజ్ జ్యూస్‌తో పాటు లిక్కర్(బ్రాందీ, విస్కీ, రమ్) మిక్స్ చేశారు. ఈ నెల 25 క్రిస్మస్ నాటికి పూర్తిస్థాయిలో కేక్‌ను సిద్ధం చేయనున్నారు.

ఎన్నికల పర్యవేక్షకుడి విశాఖ పర్యటన నేడు

మహారాణిపేట: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2024లో భాగంగా ఏపీ ఓటరు జాబితా పర్యవేక్షకుడు, ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు బుధవారం విశాఖలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఆయన విశాఖలో అందుబాటులో ఉంటారని కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. అనంతరం శ్రీకాకుళం వెళతారని, 22న అల్లూరి సీతారామరాజు జిల్లా(పాడేరు)లో పర్యటిస్తారని చెప్పారు.

సాక్షి స్టాఫ్ రిపోర్టర్ లోవరాజుకు ఆర్ఏఆర్ఎస్ అవార్డు



లోవరాజుకు అవార్డు అందిస్తున్న వ్యవసాయ వర్సిటీ డైరెక్టర్ ప్రశాంతి. చిత్రంలో ఏడీఆర్ జగన్నాథరావు, దాడి రత్నాకర్

- వ్యవసాయంపై ఉత్తమ కథనాలు అందించినందుకు పురస్కారం

అనకాపల్లి: వ్యవసాయ రంగంపై ఉత్తమ వార్తా కథనాలు అందిస్తున్న సాక్షి దినపత్రిక స్టాఫ్ రిపోర్టర్ బి.ఎ న్.వి.లోవరాజుకు ఆర్ఏఆర్ఎస్ కిసాన్‌మేళాలో పురస్కారం ప్రదానం చేశారు. రైతులకు ఉపయుక్తమైన వార్తలు, కథనాలు రాస్తున్న పాత్రికేయులకు ప్రతి ఏటా అల్లూరి సత్యనారాయణరాజు మెమోరియల్ అవార్డు అందిస్తారు. ఈ ఏడాది ఆ పురస్కారం లోవరాజును వరించింది. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు ఎల్.ప్రశాంతి శాలువా కప్పి, జ్ఞాపిక, ధ్రువపత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. వ్యవసాయంలో నూతన వంగడాలు, మెళకువలపై కథనాలు అందించినందుకు ఈ అవార్డును ప్రదానం చేస్తున్నట్టు ఆమె చెప్పారు.

అవార్డులు పొందిన మరికొందరు..

యు.వి.రాఘవేంద్రరావు మెమోరియల్ అవార్డు చోడవరం సుగర్ ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడుకు, ఆర్.ఎల్.నర్సింహం మెమోరియల్ అవార్డు బాపట్ల ఫార్మర్ అసోసియేషన్ డీన్ డాక్టర్ కె.భాస్కరరావుకు, రాష్ట్రంలో అత్యధిక చెరకు క్రషింగ్ అవార్డు పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం ఆంధ్రా సుగర్ లిమిటెడ్‌కి, రాష్ట్రంలో అత్యధిక పంచదార రికవరీ (కో ఆపరేటివ్ సెక్టార్) అవార్డు గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి లభించాయి. అల్లూరి అచ్చియ్యమ్మ మెమోరియల్ అవార్డు ఆర్ఏఆర్ఎస్ ప్రిన్సిపల్ శాస్త్రవేత్త పి.శ్రీదేవికి, మళ్ల జగన్నాథం మెమోరియల్ అవార్డు అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త షమీన్‌షేక్‌కు, సుదర్శనరాజు మెమోరియల్ అవార్డు అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ ఎ.ఆదిలక్ష్మికి, కొణతాల రామునాయుడు మెమోరియల్ అవార్డు డాక్టర్ ఎన్.రాజ్‌కుమార్‌కు, మళ్ల జగన్నాథం మెమోరియల్ అవార్డు శాస్త్రవేత్తలు డాక్టర్ కేవీ రమణమూర్తి, సన్యాసినాయుడులకు, రాగులకొల్లు చినవీరయ్య మెమోరియల్ అవార్డు రాజోలు అగ్రికల్చరల్ రీసెర్చ్ డాక్టర్ పి.ఉదయ్ బాబుకు, కొణితాల రామలింగస్వామి మెమోరియల్ అవార్డు డాక్టర్ పి.ఎం.హేమలతకు అందించారు.

లోక కల్యాణానికి ధర్మ ప్రచారం



జ్యోతి ప్రజ్వలన చేసి మాసోత్సవాలు ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ



కనకమహాలక్ష్మికి పూజలు నిర్వహిస్తున్న మంత్రి అమర్‌నాథ్. చిత్రంలో ఈవో శిరీష, కొల్లి సింహాచలం

ధర్మప్రచార మాసోత్సవాలు ప్రారంభం



ప్రచార రథం

దాబాగార్డెన్స్ (విశాఖ) : కనకమహాలక్ష్మి దేవస్థానం ఆధ్వర్యంలో ధర్మప్రచార మాసోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలకు ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి అంకురార్పణ చేశారు. నాదస్వర వాయిద్యాలు, పులివేషాలు, అమ్మవారి అలంకరణలు, కోలాట నృత్యాల నడుమ మాసోత్సవాలను మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణతో కలిసి ఆయన ప్రారంభించారు. ఉత్సవాలు వచ్చే నెల 18వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ధర్మప్రచార మాసోత్సవాల్లో భాగంగా హిందూ ధర్మం విశిష్టత, గొప్పతనాన్ని వివిధ ప్రాంతాల ప్రజలకు తెలియజేయనున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ హిందూ ధర్మ విశిష్టత, మానవతా విలువలు, అందులో దేవాలయాల పాత్ర గురించి వివరించారు. దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రచార రథం ద్వారా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అమ్మవారికి కుంకుమ పూజలు, హిందూ ధర్మం విశిష్టత తెలియజేసే పారాయణాలు, సాహిత్యపురాణ ఇతిహాస సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మప్రచార పరిషత్ డైరెక్టర్ వేదాంతం రాజగోపాలచక్రవర్తి, దేవదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎం.వి.సురేష్‌బాబు, ఉప కమిషనర్ ఎస్.సుజాత, ఆలయ ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు, దేవదాయ శాఖ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

3 వేల లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



సారా పులుపుతో ఎస్ఐ లక్ష్మణరావు, సిబ్బంది

రావికమతం : కొత్తకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో గల కొత్తూరు గ్రామ శివార్లలో 3 వేల లీటర్ల బెల్లం పులుపును ఎస్ఐ లక్ష్మణరావు సిబ్బందితో కలిసి మంగళవారం ధ్వంసం చేశారు. నాటు సారా తయారీ జరుగుతుందన్న ముందస్తు సమాచారంతో ఎస్ఐ లక్ష్మణరావు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ ఘటనలో డ్రమ్ముల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 3 వేల లీటర్ల పులుపును గుర్తించి ధ్వంసం చేశారు. సారా తయారీకి పాల్పడితే కఠిన శిక్షలు అమలు చేయనున్నట్లు ఎస్ఐ లక్ష్మణరావు పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



రాము (ఫైల్)

మునగపాక : మండలంలోని నాగులాపల్లికి చెందిన యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మంగళవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఇటుకుల అప్పారావుకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు రాము స్థానికంగా డెకరేషన్ పనులు చేసుకుంటూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. దీనిలో భాగంగా గ్రామంలో ఇటీవల జరిగిన గౌరీ పరమేశ్వరుల ఉత్సవానికి ఏర్పాటు చేసిన విద్యుత్ లైటింగ్ తొలగించే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో స్థానికులు రామును అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో కుటుంబానికి అండగా నిలుస్తాడని భావించిన తమకు తీరని దు:ఖం మిగిల్చావంటూ తల్లితండ్రులు కన్నీటి పర్యంతం అయ్యారు. తండ్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ దొర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వణికిస్తున్న చలిగాలులు



అరకులోయ ప్రాంతంలో దట్టంగా మంచు



ముంచంగిపుట్టులో కురుస్తున్న పొగమంచు

- అరకులోయలో 11.4
- మినుములూరులో 12
- చింతపల్లిలో 13.5 డిగ్రీలు నమోదు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో చలిగాలులు వణికిస్తున్నాయి. సాయంత్రం నుంచి వీటి తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి 11 గంటల నుంచి పొగమంచు కురుస్తోంది. ఉదయం 9 గంటల వరకు అరకులోయ, పాడేరు, చింతపల్లి ప్రాంతాల్లో మంచు తెరలు వీడడం లేదు. కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. అరకులోయలో 11.4డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరులో 12 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 13.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు అధికారులు తెలిపారు.

ఉదయం 10 గంటల వరకు..

ముంచంగిపుట్టు: మండలంలో ప్రతి రోజు ఉదయం 10 గంటల వరకు మంచు దట్టంగా కురుస్తోంది. మండల కేంద్రం నుంచి పెదబయలు, జోలాపుట్టు, డుడుమ మార్గాల్లో వెళ్లే వారు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బందులు పడుతున్నారు. హెడ్‌లైట్ల వెలుగులో రాకపోకలు సాగిస్తున్నారు. మూడు రోజులుగా కిలగాడ, గుమ్మా ఘాట్, వనభసింగి, ఒటిపుట్టు, రాజామామిడి మలుపుల వద్ద పొగమంచు కారణంగా వాహన ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్-3 చార్జింగ్ ప్రారంభం



ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు శుభవార్త. గత 21 నెలలుగా ఎదురు చూస్తున్న బ్లాస్ట్‌ఫర్నేస్-3 ఉత్పత్తికి సంబంధించి మంగళవారం మొదటి అడుగు పడింది. బ్లాస్ట్‌ఫర్నేస్‌లో ఉత్పత్తి ప్రక్రియకు సంబంధించి మొదటి బ్యాచ్ కోక్ సాయంత్రం 4.55 గంటలకు చార్జింగ్ ప్రారంభించారు. ఆ తర్వాత 30 టన్నుల చెక్క, అనంతరం 200 టన్నుల కోక్‌తో చార్జింగ్ చేయనున్నారు. ఈ నెల 30న ఉత్పత్తి ప్రారంభించడానికి యాజమాన్యం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా దశల వారీగా ప్రక్రియ కొనసాగుతుంది. ఈ ఫర్నేస్‌లో ఉత్పత్తి ప్రారంభం కావడం ద్వారా ఉద్యోగులు తమకు మంచి రోజులు రానున్నాయన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సీలేరు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్‌కు సంయుక్త సర్వే

- ఫారెస్ట్ భూమిని పరిశీలించిన ఏపీ జెన్‌కో, అటవీశాఖ అధికారులు
- ఉన్నతాధికారులకు నివేదిస్తాం: డీఎఫ్‌వో సూర్యనారాయణ
- 115 మెగావాట్ల సామర్థ్యంతో తొమ్మిది యూనిట్లు : ఏపీ జెన్‌కో



సర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు



వాగులు దాటుతున్న అటవీశాఖ, జెన్‌కో అధికారులు

సీలేరు: ఏపీ జెన్‌కో సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు (ఎత్తిపోతల పథకం)కు సంబంధించి అవసరమైన భూమి కోసం ఏపీ జెన్‌కో, అటవీశాఖ అధికారులు మంగళవారం సంయుక్త పరిశీలన చేశారు. దీనిలో భాగంగా ప్రాజెక్ట్ నిర్మించబోయే ప్రదేశాలలో సర్వే నిర్వహించారు. ప్రాజెక్టుకు అవసరమైన అటవీభూమి, వన్యప్రాణాలు మనుగడ, పర్యావరణ పరిస్థితులు, అటవీసంపద వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో సూర్యనారాయణ మాట్లాడుతూ జెన్‌కో ఎండీ కోరిన మేరకు క్షేత్రస్థాయి పరిశీలన జరిపామన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి 332 హెక్టార్ల భూమి అవసరం కాగా ఇందులో 215.44 హెక్టార్ల అటవీ భూమి ఉందన్నారు. గూడెం, సీలేరు బ్లాక్‌ల్లో రిజర్వ్ ఫారెస్టు భూమి ఉన్నందున పూర్తిస్థాయిలో సర్వే చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన పేర్కొన్నారు.

భవిష్యత్తులో మరింత విద్యుత్ ఉత్పత్తి

రాష్ట్రంలో రానున్న రోజుల్లో మరింత విద్యుత్ ఉత్పత్తిని సరఫరా చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణంపై దృష్టి సారించిందని జెన్‌కో ఎస్ఈలు రవీంద్రరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సంయుక్త పరిశీలనలో పాల్గొన్న వారు మాట్లాడుతూ సీలేరు పార్వతి నగర్ వద్ద ఒకొక్కటి 115 మెగావాట్ల సామర్థ్యంతో 9 యూనిట్ల నిర్మాణానికి సర్వేలు పూర్తికానున్నట్టు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే విద్యుత్ ఉత్పత్తిలో దేశంలో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందన్నారు. సీలేరు జల విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి అనంతరం నీరు వృథా కాకుండా కాండకోరి గ్రామం వద్ద ఆనకట్ట నిర్మించి తద్వారా భూమి అడుగుభాగం నుంచి పైప్‌లైన్ల ద్వారా తిరిగి గుంటవాడ రిజర్వాయర్‌కు మళ్లిస్తారన్నారు. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ నుంచి అనుమతులు లభించాయన్నారు. అటవీశాఖ సర్వే, పర్యావరణ అనుమతులు మూడు నెలల్లో కొలిక్కి వస్తాయన్నారు. సీలేరు రేంజిలో అటవీశాఖ నుంచి జెన్‌కోకు ఇస్తున్న భూమి, దానికి బదులుగా సత్యసాయి జిల్లాలో జీఏ ల్యాండ్‌ను ఇచ్చేందుకు చర్యలు జరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ సర్వేలో సబ్ డీఎఫ్‌వో బెన్నాడ రాజు, రేంజర్ శ్రీనివాస్, జెన్‌కో అధికారులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పైడిరాజు, ప్రభాకర్, ఏడీఏ అప్పలనాయుడు, ఏఈఈ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కూర్మావతారంలో ధ్యాన వేంకటేశ్వరస్వామి



కశింకోట: కశింకోటలోని ధ్యాన వేంకటేశ్వరస్వామి కూర్మావతారంలో భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామిని విష్ణుమూర్తి దశావతారాల్లో రెండవదైన కూర్మావతారంలో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు రేజేటి శ్రీరామ చరణాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు ఎక్కువగా స్వామిని దర్శించారు. మరో రెండు రోజులపాటు ఇదే అవతారంలో స్వామి భక్తులకు దర్శనమిస్తారని అర్చకుడు తెలిపారు.

24న పేదలకు రగ్గుల పంపిణీ

అనకాపల్లి : మండలంలో చిన్నిబాబుకాలనీ తిలక్‌మార్గ్ వద్ద ఈనెల 24న గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు, నిరాశ్రయులకు ఉచితంగా రగ్గులు పంపిణీ చేస్తున్నట్టు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సమగ్ర శిక్ష కాంట్రాక్టు సిబ్బంది వినూత్న నిరసన



నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు

కశింకోట : మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద విద్యా శాఖ–సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పెన్ డౌన్ చేసి భిక్షాటనతో నిరసన తెలిపారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత, సకాలంలో వేతనాలు చెల్లించాలని తదితర డిమాండ్‌లతో నినాదాలు చేశారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు డి.లక్ష్మణ, ప్రతినిధులు ఝాన్సీ, సురేష్, సత్యారావు, సూర్యదాసు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 1,061 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,610	5,130
మొదటి రకం	4,200	4,600
రెండో రకం	4,110	4,350
మూడో రకం	4,080	4,320

అనకాపల్లి సినిమాలు

జోరుగా హుషారుగా	: రాజా
ఎక్స్‌ట్రా	: సత్యనారాయణస్క్రీన్-1
-------	: సత్యనారాయణస్క్రీన్-2
యానిమల్	: షిర్డిసాయి
హాయ్ నాన్న	: పర్తిసాయి
మంగళవారం	: వెంకటేశ్వర
తికమక తాండ	: శ్రీసత్య
పిండం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 56 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-18 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్లు, ఓ పాజిటివ్-30 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషన్ యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 487 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 406 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.




ఇది కదా అభివృద్ధి

నాడు మురుగు కూపం.. నేడు సుందర రూపం



గతంలో చెత్త చెదారాలతో నిండి మురుగు కూపంగా ఉన్న ఎర్ర చెరువు



సుందరీకరణ దిశగా అడుగులేస్తున్న కొత్తూరు ఎర్ర చెరువు

- మంత్రి అమర్‌నాథ్ కృషితో కొత్తూరు ఎర్ర చెరువుకు మహర్దశ
- రూ.2 కోట్లతో సుందరీకరణ పనులు
- లారస్ ల్యాబ్స్ యాజమాన్యం ఇచ్చిన సీఎస్ఆర్ నిధులతో పనులు
- ఆహ్లాదకరంగా రూపుదిద్దుకుంటున్న చెరువు పరిసరాలు



చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్



వాకింగ్ ట్రాక్ కోసం కొత్తగా వేసిన గట్టు



చెరువు చుట్టూ కాంక్రీట్ పనులు చేస్తున్న కూలీలు

అనకాపల్లి(యలమంచిలి రూరల్):చెరువుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. కోట్ల రూపాయల వ్యయంతో చెరువులను సంరక్షించడంతో పాటు వాటి సుందరీకరణకు ప్రాధాన్యం ఇస్తోంది. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న కొత్తూరు మేజర్ పంచాయతీలో 13.50 ఎకరాల విస్తీర్ణంలో ఎర్ర చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెరువుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి చూపడంతో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కొత్తూరు ఎర్ర చెరువు అభివృద్ధికి కృషి చేశారు. ఇటీవల ఈ చెరువు అభివృద్ధి కోసం లారస్ ల్యాబ్స్ సంస్థ యాజమాన్యంతో చర్చించారు. మంత్రి ఆదేశాలతో రూ.2 కోట్ల సీఎస్ఆర్ నిధులతో చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులను చేయడానికి లారస్ ల్యాబ్స్ యాజమాన్యం అంగీకరించింది. ఈ మేరకు చెరువు సుందరీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఫలితంగా ఎర్ర చెరువు ప్రాంతంలో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. నాలుగు నెలల్లోనే చెరువు రూపురేఖలు మారిపోవడంతో ఇంతలోనే ఎంత మార్పు అని స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. ఎన్నో ఏళ్లుగా మురుగు కూపంగా మిగిలిపోయిన ఎర్ర చెరువు అభివృద్ధికి నడుం బిగించిన మంత్రి అమర్‌నాథ్, స్థానిక వైఎస్సార్‌సీపీ నేత భీశెట్టి జగన్‌లకు ఇక్కడి ప్రజలు కతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

కనిపించని పాత ఆనవాళ్లు

గతంలో ఎర్ర చెరువు చుట్టూ చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి పరిసరాల్లో తీవ్ర దుర్వాసన వచ్చేది. పందులు,పశువులు స్వైర విహారం చేసేవి. గుర్రపు డెక్క, చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో చెరువు అధ్వానంగా ఉండేది. విషపురుగులు సంచారం కూడా ఉండడంతో చెరువు వైపు చూడాలన్నా, అటువైపు వెళ్లాలన్నా స్థానికులు భయపడేవారు. వర్షాకాలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. చెరువు గట్టు బురదమయంగా మారి స్థానికులు రాకపోకలు సాగించడానికి తీవ్ర అసౌకర్యంగా ఉండేది. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా గ్రామంలో ఎర్ర చెరువు అభివృద్ధి, సుందరీకరణ అవసరాన్ని గుర్తించిన మంత్రి అమర్‌నాథ్ పట్టుదలతో సుందరీకరణ పనులు చేసేలా చర్యలు చేపట్టారు. ఇప్పటికే చెరువును ఆధునికీకరించి చుట్టూ ఇనుప కంచె వేశారు. చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మిస్తున్నారు. గ్రీనరీ కోసం పచ్చని మొక్కలు, కొబ్బరి చెట్లు పెంచడానికి, సాయంత్రం వేళల్లో ఇక్కడ స్థానికులు గడపడానికి వీలుగా విద్యుత్ వెలుగులు, కూర్చునేందుకు సిమెంటు బెంచీలు ఏర్పాటు చేయనున్నారు. త్వరలోనే ఎర్ర చెరువు ఆధునికీకరణ పనులు వంద శాతం పూర్తి కానున్నాయి. చెరువు పక్కనే 7.50 ఎకరాల్లో ఉన్న పంచాయతీ డంపింగ్ యార్డులో కొండలా పేరుకుపోయిన చెత్త చెదారాలను పూర్తిగా తొలగించి, గ్రావెల్‌తో చదును చేశారు. ప్రస్తుతం ఇక్కడ డంపింగ్ యార్డు ఆనవాళ్లు కనిపించడం లేదు. సాయంత్రం వేళ ఇక్కడ స్థానిక యువకులు, విద్యార్థులతో పాటు అనకాపల్లి పట్టణం నుంచి వచ్చిన వారు కూడా ఆటలాడుకుంటున్నారు.

మంత్రి చొరవతోనే..



మంత్రి అమర్‌నాథ్ చొరవతోనే మా గ్రామంలో ఎన్నో ఏళ్లుగా మురుగుకూపంగా మిగిలిపోయిన ఎర్ర చెరువుకు మోక్షం లభించింది. ప్రస్తుతం చెరువు సుందరీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే గతంతో పోల్చితే చెరువు రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. మారుతున్న ప్రజల జీవనశైలి, ఆరోగ్య అవసరాల దృష్ట్యా చెరువు ఆధునికీకరణ అవసరాన్ని గుర్తించిన మంత్రి అమర్‌నాథ్ కృషికి మా గ్రామ ప్రజలంతా రుణపడి ఉంటాం. చెరువు అభివృద్ధి పట్ల గ్రామ ప్రజానీకం ఎంతో సంతృప్తి చెందారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చి ప్రజలకు అవసరమైన పనులు చేపడుతున్నాం.

–భీశెట్టి జగన్, వైఎస్సార్‌సీపీ నేత, కొత్తూరు

నిజంగా అద్భుతం..



కొత్తూరులో ఎర్ర చెరువు అంటే ఒకప్పుడు పందులు, పశువుల సంచారం, దుర్గంధ భరిత వాతావరణమే గుర్తొచ్చేది. కేవలం నాలుగు నెలల్లోనే చెరువు రూపురేఖలే మారిపోయాయి. నమ్మలేకపోతున్నాం. ప్రస్తుతం చెరువు సుందరీకరణ చూసి స్థానికులంతా ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకూ సాయంత్రం వేళ సేదతీరడానికి శారదానది ఒడ్డుకు వెళ్లాల్సి వచ్చేది. ఇపుడు చెరువు సుందరీకరణతో ఆహ్లాదం చెంతకే వచ్చినట్టయింది.

–జయంతి ఫణి కుమార్, కొత్తూరు

ఈవెనింగ్ వాక్‌కు అవకాశం



ఎర్ర చెరువు అభివృద్ధికి నోచుకోవడం మాకు ఎంతో ఉపయోగం. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు, మహిళలకు సాయంత్రం సమయంలో వాక్ చేసేందుకు అవకాశం కలిగింది. గతంలో పక్కనే ఉన్న జాతీయ రహదారిపై వాకింగ్ చేసేవాళ్లం. అది ప్రమాదకరంగా ఉండేది. చెరువు చుట్టూ ఏర్పాటు చేస్తున్న వాకింగ్ ట్రాక్ ఇక్కడి ప్రజలందరికీ ఎంతో ప్రయోజనకరం.

–మవానీ కోమల్, గృహిణి, కొత్తూరు

తక్కువ సమయంలో బాగా అభివృద్ధి చేశారు



గతంలో ఎర్రచెరువు పరిసరాల్లో చీకటి పడితే ఎంతో భయానకంగా ఉండేది. చాలా తక్కువ సమయంలోనే చెరువు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇంతకుముందున్న చెరువు రూపురేఖలే పూర్తిగా మారిపోయాయి. పిల్లలు,పెద్దలకు ఉదయం, సాయంత్రం సమయాల్లో ఆహ్లాదకర వాతావరణం ఆస్వాదించడానికి వీలు కల్పించం హర్షణీయం.

–రామాని మీనాక్షి, కొత్తూరు

నాలుగున్నరేళ్లలో రూ.20.51 కోట్ల లబ్ధి



అచ్చెర్లలో మా నమ్మకం నువ్వే జగన్ కిట్లను అందజేస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి

కశింకోట: ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఎన్నడూ లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. అచ్చెర్ల సచివాలయంలో ×ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే..కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో నాలుగున్నరేళ్లలో అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాల లబ్ధి, అభివృద్ధి పనుల కింద రూ.20.51 కోట్ల లబ్ధి ప్రభుత్వం చేకూర్చిందని తెలిపారు.

'వై ఏపీ నీడ్స్ జగన్' నేడు

అనకాపల్లి : జీవీఎంసీ విలీనగ్రామమైన 84వ వార్డు సాలాపువానిపాలెం గ్రామం, మండలంలో గోపాలపురం సచివాలయ పరిధిలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, మండల పార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్‌లు మంగళవారం ఓ వేర్వేరు ప్రకటనలో తెలిపారు. సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ లబ్ధి వివరాల డిస్‌ప్లే బోర్డు, ప్రధాన కూడలిలో పార్టీ జెండా ఆవిష్కరణ చేయనున్నట్లు చెప్పారు. పట్టణ, మండల సచివాలయాల కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వలంటీర్లు హాజరుకావాల్సిందిగా కోరారు.

ఘనంగా ఎంపీపీ సూరిబాబు జన్మదిన వేడుకలు



మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను, సూరిబాబును సత్కరిస్తున్న పార్టీ నేతలు

అనకాపల్లి : మండలంలో గోపాలపురం గ్రామంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు స్వగృహంలో ఆయన జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా హాజరై సూరిబాబును అభినందించారు. జన్మదిన కేక్ కట్ చేసి సూరిబాబుకు తినిపించారు. అంతకు ముందు పూలమాలతో అమర్‌నాథ్‌తో పాటు సూరిబాబును నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ రాష్ట్ర చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎన్టీఆర్ వైద్యాలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, మండల పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు మల్రిపల్లి శోభ, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో గ్రామ దేవతల ఉత్సవాలు

- మంత్రి అమర్‌నాథ్ పిలుపు
- కుంచావారి గౌరీ పరమేశ్వరులు ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ



కుంచావారి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి

అనకాపల్లి : గ్రామ దేవతల మహోత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహిస్తూ ప్రభుత్వానికి సహకరించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు తమ క్యాంపు కార్యాలయంలో ఈనెల 23న జరిగే కుంచావారి గౌరీపరమేశ్వరుల ఉత్సవ గోడ పత్రికలను మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. సుమారుగా 200 సంవత్సరాల చరిత్ర కలిగిన మహోత్సవాన్ని ప్రతి ఏడాది కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఆలయానికి వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.వీరభద్రరావు(అబ్బులు), గౌవాధ్యక్షుడు పాండ్రంగి సత్యారావు, ఎన్టీఆర్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ జి.రామ్మూర్తి, కమిటీ సభ్యులు కోరుకొండ సాంబశివరావు,పాలూరి శ్రీనివాసరావు, కొమ్మోజి రామకృష్ణ, బొండు జాడేష్, అద్దేపల్లి పోతురాజు, కుంచా దివాకర్, సందీప్ పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో ఆకాష్‌కు కాంస్య పతకం



కాంస్య పతకం సాధించిన ఆకాష్‌ను అభినందిస్తున్న దాడి రత్నాకర్

తుమ్మపాల : ఇటీవల గాజువాకలో జరిగిన 13వ ఏపీ స్టేట్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్– 2023 నేషనల్ సెలక్షన్స్‌లో ఫుల్ కౌంట్ విభాగంలో 61 కేజీల కేటగిరీలో దాడి వీరునాయుడు కళాశాల విద్యార్థి ఎస్.ఆకాష్ కాంస్య పతకం సాధించాడు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలికులు దాడి రత్నాకర్ అతనిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం ఇటువంటి ప్రతిభ గల విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తూ, వారికి తగిన అవకాశాలను అందించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి తల్లిదండ్రులకు, కళాశాలకు, అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కొరిబిల్లి రమేష్, అధ్యాపకుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

కశింకోట: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమ్మె నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మూతపడిన అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించినట్లు ఐసీడీఎస్ సీడీపీఓ పి. ప్రభావతి తెలిపారు. మండలంలో 69 అంగన్‌వాడీ కేంద్రాలుండగా వాటిలో 65 కేంద్రాలను తెరిపించినట్లు తెలిపారు. తాళ్లపాలెం, కశింకోట కేంద్రాల్లో మంగళవారం ఐదుగురు పిల్లలు హాజరయ్యారన్నారు. కేంద్రాలకు జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి ఉత్తర్వుల మేరకు సచివాలయ సిబ్బందిని ఇన్‌ఛార్జిలుగా నియమించారన్నారు. గ్రామ వలంటీర్లకు నిర్వహణ అప్పగించారన్నారు. కేంద్రాల్లో బుధవారం నుంచి ఆహారం అందిస్తామన్నారు. పాఠశాలలు ఉన్న చోట మధ్యాహ్న భోజన పథకం కార్మికులు భోజనం తయారు చేసి కేంద్రాలకు అందించనున్నారన్నారు.

ప్రజారోగ్యానికి సీఎం జగన్ పెద్ద పీట

- నూతన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



రూ.25లక్షలు విలువ చేసే ఆరోగ్యశ్రీకార్డు పంపిణీ చేస్తున్న మందపాటి సునీత

అనకాపల్లి : ప్రాణాంతకమైన వ్యాధులు సోకినప్పుడు బలహీనవర్గాలు ఇబ్బందులు ఎదుర్కోకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టడం అభినందనీయమని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. విజయరామరాజుపేట వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ ఆధ్వర్యంలో సచివాలయం-3లో మంగళవారం రూ.25 లక్షలకు పరిమితి పెంచిన కొత్త ఆరోగ్యశ్రీకార్డులను ఆమె ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లో పేదోడికి రోగం వస్తే తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని, నేటి పాలనలో అటువంటి సమస్య లేకుండా ప్రభుత్వం కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం పొందే విధంగా వీలు కల్పించిందన్నారు. 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి మాట్లాతూ 3,257 వ్యాధులకు 2,285 ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ కార్డు ద్వారా చికిత్స పొందవచ్చన్నారు.కొత్తగా సచివాలయం పరిధిలో 750 కార్డులు వచ్చాయని, సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మాట్లాడుతూ విద్య, వైద్యం రెండునేత్రాలుగా పాలన సాగుతోందన్నారు. ఈనెల 21న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు పురస్కరించుకొని ఇంటింటి కుళాయి కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు చెప్పారు.

జిల్లా పార్టీ కార్యదర్శి జాజుల రమేష్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకొని మరిన్ని సంక్షేమ పథకాలు అందుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఎం ఆరోగ్య కేంద్ర వైద్యులు నాగేంద్ర, నీరజ, పార్టీ నేతలు పలకా సత్యనారాయణ, గైపూర్ రాజు, మూనూరు శ్రీను, త్రినాథ్, సత్తిబాబు, ఉగ్గిన అప్పారావు, రవీంద్రనాథ్, లక్ష్మణరావు, రమణాజీ పాల్గొన్నారు.

నృత్యాల రూపంలో గణిత భావనల ప్రదర్శన



గణిత భావనలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కశింకోట : మండలంలోని వెదురుపర్తి హైస్కూల్లో విద్యార్థులు గణిత భావనలను పద్యాలు, నృత్యాల రూపంలో మంగళవారం ప్రదర్శించారు. ఆహూతులను అలరించారు. జాతీయ గణిత పక్షోత్సవాల్లో భాగంగా గణితంలోని అంశాలకు సంబంధించిన భావనలను ప్ల కార్డులు ధరించి నృత్య రూపంలోను, పద్యాలుగాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ప్రదర్శన నిర్వహించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం జి.వి.కె ఆచారి మాట్లాడుతూ జ్యామితీయ, సంఖ్యామానం, వివిధ గణిత గుర్తులు, ఎక్కాలు నృత్యాలు, పద్యాల ద్వారా అవగాహన కలిగించడం అభినందనీయమన్నారు. గణిత ఉపాధ్యాయులు ఎ.వి.ఎస్ మూర్తి, పి.వి.ఎస్.ఎన్ మూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు బోయిన చిన్నారావు, ఎ.సోమరాజు, సబితలక్ష్మి, నూకరాజు, త్రివేణి పాల్గొన్నారు.

ఆస్తి, కుళాయి పన్నులు తక్షణమే చెల్లించాలి

అనకాపల్లి : జోనల్ పరిధిలో ప్రభుత్వం వివిధ గృహాలకు ప్రభుత్వం సరఫరా చేసిన తాగునీటి కుళాయి బకాయి పన్నులను తక్షణమే చెల్లించాలని జోనల్ కమిషనర్ సుర వెంకటరమణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బకాయిలు పెరిగిన కుళాయిలు, ఆస్తి పన్నులను తక్షణమే చెల్లించాలని లేని పక్షంలో ప్రభుత్వ ఆదేశాలు మేరకు చట్టపరమైన చర్యలు చేపట్ట డం జరుగుతుందని తెలిపారు.

నేడు ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

కశింకోట : కశింకోట పంచాయతీ కార్యాలయంలో సచివాలయం-1 పరిధి ప్రజలకు బుధవారం ఉదయం 10.30 గంటలకు ఆరోగ్యశ్రీ కార్డులను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పంపిణీ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా చికిత్స పొందడానికి గతంలో ఉండే రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిన నేపథ్యంలో మంత్రి కొత్త కార్డులు అందజేయనున్నారన్నారు. అలాగే ఈ నెల 21న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కూడా మంత్రి అమర్‌నాథ్ హాజరై కేక్ కట్ చేసి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేస్తారన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

హామీలన్నీ అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దే



డిస్‌ప్లేబోర్డును ఆవిష్కరిస్తున్న దిలీప్‌కుమార్

అనకాపల్లి : ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 98 శాతం అమలు చేయడమే కాకుండా కొత్తవి రూపకల్పనతో ఆరోగ్యశ్రీకార్డులు అందించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని ఏపీఐడబ్ల్యూఏ రాష్ట్ర చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. ఊడేరు గ్రామంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అంతకుముందు సచివాలయ పరిధిలో లబ్ధిదారుల డిస్‌ప్లేబోర్డును ఆవిష్కరించి, గ్రామస్తులకు బ్రోచర్లను అందించారు. ప్రధాన కూడలి వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, సర్పంచ్ కృష్ణ మోహన్, ఎంపీటీసీ అచ్చియ్యమ్మ, సచివాలయ కన్వీనర్లు సంతోష్, కృష్ణ, అప్పారావు, ఈవోఆర్డీ ధర్మారావు, ఎమ్మెల్సీ మహేంద్ర, పార్టీ నేతలు పాల్గొన్నారు. అలాగే జీవీఎంసీ విలీన గ్రామమైన గొర్లివానిపాలెం గ్రామంలో 80వ వార్డు ఇన్‌ఛార్జి కొణతాల భాస్కరరావు వైపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించి గ్రామస్తులకు బ్రోచర్లు అందజేశారు. పార్టీజెండాను ఆవిష్కరించి అక్కడే రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు.

ఫార్మర్ సైంటిస్ట్ కోర్సు శిక్షణ

తుమ్మపాల: స్థానిక శ్రీ వేంకటేశ్వర కళ్యాణమండపంలో ఫార్మర్ సైంటిస్ట్ కోర్స్ రీజనల్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్ట్ అధికారి సీహెచ్.లచ్చన్న ఫార్మర్ సైంటిస్టులకు, మెంటార్స్‌కు అకాడమీకి సంబంధించి సెమిస్టర్ మెటీరియల్స్ అందించారు. కోర్సులో ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణులవ్వాలని, అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీవో హేమసుందర్, డీపీపీ, టీపీపీలు పాల్గొన్నారు.

